అభివృద్ధి చేయరు.. చేస్తే సహించలేరు

టీడీపీ నాయకుల తీరుపై విప్ ఉదయభాను మండిపాటు



జగ్గయ్యపేటలో వడ్డెర స్మశానవాటిక అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: తెలుగుదేశం పార్టీ నాయకులకు అభివృద్ధి చేయడం చేతకాదని...వందలాది కోట్ల రూపాయలతో జగ్గయ్యపేట నియోజకవర్గ అభివృద్ధికి తాను కృషిచేస్తుంటే చూసి ఓర్వలేక కోర్టుల కెక్కుతున్నారని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను మండిపడ్డారు. స్థానిక బలుసుపాడు రోడ్డు, ముక్త్యాల రోడ్‌లలో సుమారు రూ.1కోటి వ్యయంతో చేపట్టిన వడ్డెర, పట్కారీ, పద్మశాలీల స్మశాన వాటికల అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విప్ సామినేని ఉదయభాను మాట్లాడుతూ పట్టణంలోని వడ్డెర, పట్కారీ, పద్మశాలీలల స్మశాన వాటికల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రూ.1కోటితో ప్రహరీ, బోర్ల ఏర్పాటు, గదుల నిర్మాణం తదితర మౌలికవసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని తాను అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తుంటే, తనకు ఎక్కడ మంచిపేరు వస్తుందోనన్న దుర్బుద్ధితో టీడీపీ నాయకులు ప్రతివిషయానికి కోర్టులకు వెళ్తూ ఆయా అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారన్నారు. పేదలకు గృహనిర్మాణాలు, ఊరచెరువు అభివృద్ధి, షాదీఖానా నిర్మాణం, హైవే బస్టాండ్, రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులపై స్థానిక తెలుగుదేశం నాయకులు కోర్టులకు వెళ్లి ఆయా పనులను ఆటంకం కలిగిస్తున్నారన్నారు. ఇలా అభివృద్ధిని అడ్డుకోవడం టీడీపీ నాయకులకే సిగ్గుచేటన్నారు. టీడీపీ నాయకుల కుట్రలను నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని, వారికి వచ్చే ఎన్నికల్లో సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు, ఆటంకాలు సృష్టించినా అభివృద్ధి పనుల విషయంలో రాజీపడే ప్రసక్తేలేదన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ యువనాయకుడు సామినేని వెంకట కృష్ణప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కౌన్సిలర్లు, వడ్డెర, పట్కారీ, పద్మశాలీ కుల సంఘాల పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలు ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న విప్ ఉదయభాను

రూ.14కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు..

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయాన్ని రూ.14కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తెలిపారు. ఆలయం వద్ద, మునేరు అవతల అమ్మవారి మామిడి తోటల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయా పనులు సాగుతున్న తీరుపై అధికారులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ నాడు తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో ఆలయాన్ని రూ.5కోట్లతో అభివృద్ధి చేస్తే మరలా ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తన ఆధ్వర్యంలోనే రూ.14కోట్లతో అభివృద్ధి పనులు చేస్తుండటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆలయం వద్ద కేశఖండనశాల, డార్మిటరీ, టాయిలెట్ బ్లాక్, కల్యాణవేదిక స్థల అభివృద్ధితోపాటు మునేరు అవతల మామిడి తోటల్లో కల్యాణ మండప వేదిక, షెడ్లు, ఏసీ గదులు నిర్మిస్తున్నట్లు వివరించారు. గత టీడీపీ పాలనలో ఆలయ అభివృద్ధికి ఏమి చేయలేదని విమర్శించారు. అభివృద్ధి పనులను పూర్తి చేసి త్వరలోనే పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి నరసింహారావు, నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, వెంకటరమణ, ఏఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మాలధారులు



శ్రీతిరుపతమ్మ ఆలయం వద్ద బోనాలతో భక్తుల సందడి

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు.సెలవుదినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జామునుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడితోటల్లో సేదతీరారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పార్థసారథి

గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారిని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు ఆయనను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు బారు సుధారాణి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దర్శించుకున్న టీటీడీ పాలకవర్గ సభ్యుడు..

శ్రీతిరుపతమ్మవారిని టీటీడీ పాలకవర్గ సభ్యుడు, తెలంగాణ రాష్ట్రం, హుజూరునగర్‌కు చెందిన రామిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు ఆయనను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఆలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పార్థసారథిని ఆశీర్వదిస్తున్న వేదపండితులు, పక్కన చైర్మన్ జంగాల



టీటీడీ పాలకవర్గ సభ్యుడు రామిరెడ్డిని సత్కరిస్తున్న ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు

రాములోరి అక్షింతల పంపిణీ



నందిగామ: అయోధ్యలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రామాలయ ప్రతిష్ట నేపథ్యంలో స్వామివారిని స్పర్శించిన అక్షింతలను దేశవ్యాప్తంగా ప్రతి ఇంటికి చేరవేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం నందిగామ పట్టణంలో పలు సేవా సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో స్వామివారి అక్షింతలు, కరపత్రాలు, ఆలయ చిత్రపటం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవాభారతి నిర్వాహకుడు ప్రసాద్ మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గ వ్యాప్తంగా పలు సేవా సంస్థల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలోనూ కొద్దిరోజులుగా ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): చలికాలం దృష్ట్యా వృద్ధులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ కోనా వీరబ్రహ్మం సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వృద్ధులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

ప్రారంభానికి సిద్ధంగా ప్రభుత్వ భవనాలు



చిల్లకల్లు గ్రామ సచివాలయ భవనం



రైతు భరోసా కేంద్రం



వైఎస్సార్ రూరల్ హెల్త్ క్లినిక్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని చిల్లకల్లులో రూ.79లక్షలతో చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణాపు పనులు పూర్తయి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. చిల్లకల్లులో రూ.40లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.08లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.05లక్షలతో వైఎస్సార్ రూరల్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలు చేపట్టారు. ఈ మూడు భవనాల పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంటున్నట్లు పంచాయతీ రాజ్ జేఈ శ్రీనివాసరావు తెలిపారు. మరో వారం రోజుల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను చేతుల మీదుగా ఈ భవనాలను ప్రారంభించనున్నట్లు ఆయన వివరించారు.

బీసీలకు గుర్తింపునిచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఏడున్నర దశాబ్దాల భారతదేశ చరిత్రలో బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకొని వదిలేసిన ప్రభుత్వాలను చూశామని, కానీ తొలిసారి బీసీలకు అసలైన గుర్తింపు నిచ్చిన సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూస్తున్నామని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం నగర యువజన అధ్యక్షుడిగా ఎంపికైన చిట్టూరి హరీష్‌కు బీసీ సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యాన సింగ్‌నగర్‌లో ఆదివారం ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీకాంత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు అన్నిరంగాల్లో అధిక ప్రాధాన్యత లభించిందన్నారు. కిందిస్థాయి డైరెక్టర్ల నుంచి పలు కార్పొరేషన్ల చైర్మన్లు, మేయర్లు, ఎమ్మెల్యే సీట్లు, క్యాబినేట్‌లో మంత్రిపదవుల వరకూ అనేక పదవులను బీసీలకు అప్పగించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. బీసీల అభ్యున్నతి కోసం జగనన్న ప్రభుత్వం ఎల్లవేళలా అండగా నిలుస్తుందని, బీసీలంతా రానున్న ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. హరీష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి యువజన విభాగ బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర అధ్యక్షులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీల అభివృద్ధి కోసం తనశక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. బీసీ సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

గ్రూప్-2 అభ్యర్థులకు అవగాహన



స్టడీ మెటీరియల్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, అధికారులు తదితరులు

నందిగామ: స్థానిక రైతుపేటలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో యూటీఎఫ్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గ్రూప్–2కి ప్రిపేరయ్య అభ్యర్థులకు ఆదివారం అవగాహన సదస్సు కల్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఆర్డీవో సాయిబాబు మాట్లాడుతూ గ్రూప్–2 ప్రిపరేషన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయా సిలబస్‌ను సమయపాలనతో చదివి ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. గ్రూప్–2 స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించి, అభ్యర్థులకు పంపిణీ చేశారు. పట్టణంలోని లైబ్రరీకి రూ 30 వేలు విలువచేసే స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు మహేశ్వర వెంకటేశ్వరరావు, రమణయ్య, గంగరాజు, విద్యార్థి సంఘాల నాయకులు గోపినాయక్, లాల్ సలాం పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చని వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య చెప్పారు. సిప్ అబాకస్ ఇండియా ఆధ్వర్యంలో సిప్ అర్థమెటిక్ జీనియస్ కాంటెస్ట్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారం సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగాయి. వివిధ జిల్లాల్లోని పలు పాఠశాలకు చెందిన 700 మందికిపైగా విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని సీతారామయ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జీవజీ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ జె.అరుణారెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు వారిలోని ప్రతిభకు మరింత పదును పెట్టుకునేందుకు అవకాశం లభిస్తోందన్నారు. సిప్ అబాకస్ సంస్థ స్టేట్ హెడ్ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ఈ నెల 28న చెన్నైలో జాతీయ స్థాయిలో జరిగే పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఆదివారం నిర్వహించిన పోటీల విజేతలకు అతిథులు బహుమతులతోపాటు సర్టిఫికెట్‌లను అందజేశారు.

క్లుప్తంగా

సర్పంచి జ్యోతిబ్రహ్మాంనకు ప్రభుత్వ విప్ పరామర్శ



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడులో శుక్రవారం తెల్లవారుజామున సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మాంకు చెందిన లారీ కాలిపోయిన ఘటనకు సంబంధించి ఆదివారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఘటన వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం కాలిపోయిన లారీని పరిశీలించారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ఘటనకు సంబంధించి కొందరిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇలాంటి దురదృష్ట ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఆయన వెంట ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, అలయ డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు, గ్రామ నాయకులు ఉన్నారు.

వైభవంగా గరుడోత్సవం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ప్రాచీన దేవాలయమైన శ్రీరంగనాయకస్వామి వారి ఆలయంలో గరుడోత్సవం వైభవంగా జరిగింది. పాలేటి తీరంలో కొలువైయున్న శ్రీభూగోదాసమేత రంగనాయకస్వామి వారి ఆలయంలో స్వామివార్లకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూలతో అలంకరించిన రథంపై స్వామివార్ల ఉత్సవమూర్తులను ఉంచి గరుడవాహన సేవను సంప్రదాయంగా నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం మహిళా కమిటీ బృందం కోలాటం అందరినీ ఆకట్టుకుంది. జీఆర్సీ విద్యాసంస్థల ప్రతినిధి రంగాపురం నరసింహారావు కుటుంబసభ్యుల సహకారంతో జరిగిన ఈ గరుడ వాహనసేవలో విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్నలూరులో గడపగడపకు మనప్రభుత్వం

కంచికచర్ల : మండలంలోని మున్నలూరు గ్రామంలో సోమవారం సాయంత్రం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొంటారన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు స్పందన కార్యక్రమం

కంచికచర్ల : ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ షేక్ నాగుల్‌మీరా తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు.

రేపు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని బండిపాలెంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్‌లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగే ఈ శిబిరంలో జగ్గయ్యపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారని వివరించారు. ఈ శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఠాగూర్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పౌర గ్రంథాలయ శాఖ ఉత్తర్వుల మేరకు ప్రతి నెలా మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఈ ప్రదర్శనలో పలు రకాల నీతి కథలు, రామాయణం భారత కథలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. చిన్నారులకు పుస్తకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిణి కే రమాదేవి మాట్లాడుతూ పుస్తకాలు దారి చూపే దివ్వెలని అంతటి మహోన్నత్యం గల పుస్తకాల ప్రాముఖ్యత గురించి పిల్లలకు అవగాహన కల్పించడానికే ప్రదర్శన నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వై ధనలక్ష్మి, జే శంకర్, ఫణిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

లాభాల బాటలో మహిళా చేయూత మార్ట్



చేయూత మహిళా మార్ట్ నిర్వాహకులతో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, అధికారులు

కంచికచర్ల : స్థానిక మహిళా చేయూత మార్ట్ లాభాల బాటలో పయనిస్తోందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మార్ట్ నిర్వాహకబృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కంచికచర్లలో గతేడాది మార్చిలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు చేతులమీదుగా మహిళా మార్ట్‌ను ప్రారంభించామన్నారు. 15వేలమంది డ్వాక్రా సభ్యులు కలిసి రూ.30లక్షల పెట్టుబడితో ఈ మార్ట్‌ను ఏర్పాటు చేయగా, ప్రస్తుతం రోజుకు అమ్మకాలు రూ.50వేలకు చేరాయని వివరించారు. గత ఐదునెలల కాలంలో మార్ట్‌లో అమ్మకాలు రూ.1కోటికి పైగా పెరిగాయని చెప్పారు. వచ్చిన లాభాలతో తిరిగి మార్ట్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ఏడాది పూర్తయిన తర్వాత లాభాలను మార్ట్ సభ్యులకు పంచుతామని చెప్పారు. రానున్న కాలంలో మార్ట్ మరింత లాభాలు సాధించేలా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఏపీఎం కోట భాస్కరరావు, సీసీలు నరసింహారావు, ఆఫీస్ బేరర్స్ ఎం.రోజారమణి, ఎం. పుల్లమ్మ, కె.పద్మావతి, బి.అరుణ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ పండుదొర

నందిగామ: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్సై పండు దొర సూచించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రౌడీషీటర్లు నడుచుకోవాల్సిన తీరుపై ప్రత్యేక హెచ్చరికలు జారీ చేశారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: నేరచరిత్ర కలిగినవారు నడవడికను మార్చుకుని సత్ప్రవర్తనతో నడుచుకోవాలని వీరులపాడు ఎస్ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీట్ కలిగి ఉన్నవారికి ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి రౌడీ షీటర్‌పై పూర్తిస్థాయిలో నిఘా ఉందన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, అల్లర్లకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలిగేవారిపై నిబంధనలకు అనుగుణంగా రౌడీషీట్ తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని వివరించారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి పెద్దపీట

విప్ ఉదయభాను



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విప్ ఉదయభాను, పక్కన ముదిరాజ్ సంఘ నాయకులు

పెనుగంచిప్రోలు: రాష్ట్రంలో పేదవర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక మునేరు అవతల ఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆదివారం ఆయన ముదిరాజ్ క్యాలెండర్–2024ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా విప్ సామినేని ఉదయభాను మాట్లాడుతూ ముదిరాజ్‌ల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వివరించారు. మత్స్యకార భరోసా కింద ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.10 వేలు అందిస్తోందన్నారు. జగ్గయ్యపేటలో ముదిరాజ్‌ల సంక్షేమ భవనానికి తనవంతు కృషి చేశానని, గండ్రాయిలో ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మత్స్యకారులు బైక్‌లు కావాలని అడుగగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో శ్రీతిరుపతమ్మవారి ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, యువజన నాయకుడు, జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వేల్పుల రవికుమార్, ముదిరాజ్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి కృష్ణమోహన్, ప్రధానకార్యదర్శి బండారు వెంకటరాజు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొప్ప దుర్గారావు, అంగజాల కాశీరాజ్, నాయకులు కె.రమణి, కె.సుధాకర్, పి. వెంకట్రామయ్య, పులి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



గాయనీ గాయకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: గాయనీ గాయకులు స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని హైదరాబాద్‌కు చెందిన సరస్వతీ కళాపీఠం వ్యవస్థాపకురాలు మధిర రోజా ప్రసన్నత సూచించారు. నూతన సంవత్సరం, సంక్రాంతి వేడకల సందర్భంగా సరస్వతి కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. మధిర రోజా ప్రసన్నత మాట్లాడుతూ గాయనీ గాయకులు నిత్యం పాటలోని సాహిత్యం అధ్యయనం చేయాలని సూచించారు. బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి మాట్లాడుతూ సరస్వతీ కళాపీఠం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విలువలతోకూడిన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ప్రతిభను గుర్తిస్తూ నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తునట్లు తెలిపారు. పీసుపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, కొప్పరపు ఉమాబలరాం, కొమ్మినేని రత్నకుమారి, వడ్డాది కామేశ్వరి తదితరులు శాస్త్రీయ, క్లాసికల్ గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులు కాటూరి దుర్గాప్రసాద్, దేవికృష్ణ, చింతకాయల చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి, చిత్రకారుడు మల్లిక్‌తోపాటు గాయనీ గాయకులను వాయిద్య సహకారం అందించిన వారిని ఆత్మీయంగా సత్కరించారు.